క్లుప్తంగా

21న వైఎస్సార్‌సీపీ రోడ్ షో

మారేడుమిల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలున్నర ఏళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించడానికి ఈ నెల 21న మారేడుమిల్లి మండలంలో చేపట్టనున్న వైఎస్సార్ వాహనమిత్ర రోడ్ షో కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి కోరారు. ఈ రోడ్ షో కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొంటారని తెలిపారు. 21 తేదిన ఉదయం 10.30 గంటలకు సున్నంపాడు గ్రామం నుంచి ప్రారంభమై 11.45 గంటలకు జీఎం వలస, మధ్యాహ్నం 2 గంటలకు ఆకుమామిడికోట, 3.30 గంటలకు బోదులూరు, సాయంత్ర 5 గంటలకు మారేడుమిల్లిలో జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన రేపు

చింతూరు: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్‌లు సోమవారం చింతూరు, వై రామవరం మండలాల్లో పర్యటించనున్నట్టు అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు . కార్యక్రమంలో భాగంగా ఉదయం 10.30 గం .లకు చింతూరులో ప్రభుత్వ పాత ఆస్పత్రి ఆవరణలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.15 గంటలకు వై.రామవరం మండలం డొంకరాయిలో, 2.30కు బచ్చులూరులో, 3.30కు రాజుక్యాంపులో, సాయంత్రం 4.30కు మంగంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొంటారని తెలిపారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యూరు: సింగవరం సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. హోమం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడు ఆంధ్ర గణేశ్ మాష్టారు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, దుర్గ, కళ్యాణం తదితరులు పాల్గొన్నారు.

బోడిదొరకు మెరుగైన వైద్యం


కెజీహెచ్‌లో బోడిదొరను పరామర్శిస్తున్న ఎస్టీ సెల్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

జి.మాడుగుల: స్వతంత్ర సమరయోధుడు మల్లుదొర మనువడు బోడిదొరకు మెరుగైన వైద్యం అందించాలని విశాఖపట్నంలో కెజీహెచ్ ఆస్పత్రి వైద్యాధికారులకు వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి కోరారు. విశాఖ కెజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బోడిదొరను శనివారం ఆమె పరామర్శించారు. బోడిదొర ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుతం అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బోడిదొరకు మెరుగైన వైద్యం అందించాలని కెజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు.

ఆదివాసీలకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్

అరకులోయ రూరల్: 2024 డీఎస్సీలో షెడ్యూల్ ప్రాంతాల్లో జీవో నంబర్ 3 ప్రకారం ఉద్యోగ భర్తీలు నిర్వహించాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ షెడ్యూల్ గిరిజన ప్రాంతాల్లో 2024 డీఎస్సీలో జీవో3 ప్రకారం పోస్టులు భర్తీ చేసి, ఆదివాసీ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించాల న్నారు. ఏజెన్సీలో గిరిజన సంక్షేమ, హాస్టళ్లు, పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలన్నారు, సంబంధిత నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. బాలదేవ్, జగన్నాథం పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల సేవలు విలువైనవి

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


సేవారత్నకు ఎంపికైన గ్రామ వలంటీర్ గిరిని సత్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: గ్రామ వలంటీర్లే రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని ముందుకు నడిపించే రథసారథులని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో గ్రామ వలంటీర్లను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించిన గ్రామ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా నిలిచారన్నారు. కరోనా లాంటి విపత్కర సమయాల్లోనూ వలంటీర్లు నిరుపమాన సేవలందించారన్నారు. ప్రతినెలా మొదటి తారీఖు రాగానే తెల్లవారకముందే అవ్వా, తాతలకు నిద్రలేపి మరీ ఫించను సొమ్ములు అందించి మనన్నలు పొందుతున్నారన్నారు. సేవా భావంతో వీరు చేస్తున్న సేవలను గుర్తించి జగన్ మోహన్‌రెడ్డి వీరికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా మళ్లీ రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని.. ముఖ్యమంత్రి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆమె అన్నారు. జీకే వీధి, చింతపల్లి జెడ్పీటీసీ సభ్యులు శివరత్నం, బాలయ్య, ఎంపీపీ కుమారి, సర్పంచ్‌లు సుభద్ర, దుర్గ, కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, లోవకుమారి, రామన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు గిరిప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ అరుణ్‌కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం


సమావేశంలోని మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. అధికారుల తీరుపై ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీటీసీలు, సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు.. మండల అభివృద్ధికి కీలకపాత్ర వహించాల్సిన అధికారులు సమావేశాలకు హాజరు కాకపోతే గ్రామాల్లో సమస్యలు ఎలా పరిష్కారమవుతాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్న నేపథ్యంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని, ప్రణాళికలను రుపొందించాలన్నారు. పలు శాఖల అధికారులు సమావేశాలకు గైర్హజరవుతున్నారని, దీనిపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. అందరూ సమష్టిగా ముందుకు సాగితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొవచ్చునని, దీనికి అధికారులు సహకారం అందించాలన్నారు. సారా బట్టీలపై దాడులు విస్తృతం చేయాలని, విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, సర్పంచ్‌లు గణేష్, అన్నపూర్ణ కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ బొర్రా జిప్‌లైన్ నిర్వహణలో చట్టాలు ఉల్లంఘన ఉందని, వీఎస్ఎస్ పరిధిలోని భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వొద్దన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కరక రాము అన్నారు. దీనిపై గ్రామాల్లో విస్తృతం ప్రచారం చేయాలని కోరారు. అనంతరం బొర్రా వద్ద పార్కింగ్ ఫీజు వసూలు చేసే యంత్రాన్ని ఎంపీడీవో శ్రీహర్షిత్, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రారంభించారు. ఎంపీటీసీలు మితుల, అశోక్, తాటినాయుడు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అప్పారావు, సన్యాసిరావు, మోస్య అధికారులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో పది పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

రాజవొమ్మంగి: మండలకేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలోజరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ప్రిన్సిపాల్ ఎం.వి.గోపాల కృష్ణ తెలిపారు. తపాలా శాఖ ద్వారా శనివారం మండల కేంద్రానికి చేరుకొన్న 3 సెట్ల ప్రశ్నాపత్రాలు స్థానిక యూనియన్ బ్యాంకు చేరుకొన్నట్టు చెప్పారు. వాటిని బ్యాంకు యాజమాన్యం లాకర్‌లో భద్రపరచినట్టు పేర్కొన్నారు. పాఠశాలకు చెంది ఈ ఏడాది మొత్తం 59 మంది పిల్లలు పరీక్షలకు హాజరవుతున్నట్టు చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఫర్నిచర్, తాగునీటి సదుపాయం, కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్టు చెప్పారు.

తిరుమల ఉత్సవాల్లో జడ్డంగి కోలాట బృందం ప్రదర్శన


తిరుపతిలోని ఆలయ అధికారులతో జడ్డంగి కోలాట బృందం సభ్యులు

రాజవొమ్మంగి: మాఘమాస ఉత్సవాలను పురస్కరించుకొని తిరుపతిలోని శ్రీ గోవిందరాజులస్వామి వారి ఆలయం వద్ద సేవతో పాటు భజనలు, కోలాట నృత్యాల్లో పాల్గొనేందుకు మండలంలోని జడ్డంగి నుంచి మహిళా భక్తులు తరలివెళ్లారు. జడ్డంగి గ్రామానికి చెందిన కుప్పిలి లక్ష్మి నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలో 20 మంది యువతులతో చేపట్టిన కోలాటం, భజనలు ఆకట్టుకొన్నాయి. మన్య ప్రాంతం నుంచి వచ్చిన మహిళలు ఇంత గొప్పగా ప్రదర్శనలు ఇవ్వడం ఆనందదాయకరమని ఈవో, ఆలయ అధికారులు అభినందించారు. తిరుపతిలోని ఆలయంలో భగవంతుని సన్నిధానంలో ఈ అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని జడ్డంగి భజన బృందం సంతోషం వ్యక్తం చేశారు.

సోలార్ ఇరిగేషన్ యూనిట్లతో ప్రయోజనం


గిరిజన రైతులకు సోలార్ యూనిట్లను అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : సోలార్ ఇరిగేషన్ యూనిట్లు వినియోగించి వ్యవసాయంలో అధిగ దిగుబడులు సాధించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. అందుబాటులో ఉన్న జల వనరులను వినియోగించుకొని ఏడాదికి రెండు పంటలను పండించాలన్నారు. ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో సీసీడీపీ నిధులతో కొయ్యూరు మండలానికి చెందిన ఆరుగురు గిరిజన రైతులకు సోలార్ ఇరిగేషన్ యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ ఒక్కో గిరిజన రైతుకు రూ.1.15లక్షల విలువైన సాగునీటి యంత్రాలను ఉచితంగా అందజేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజన రైతులకు 110 యూనిట్లను పంపిణీ చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 103 యూనిట్లను పంపిణి చేశామన్నారు. వ్యవసాయ దిగుబడులు సాధించేందుకు రైతులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వీఎస్ ప్రభాకర్ రావు, ప్రాజెక్టు వ్యవసాయ శాఖ అధికారి కె.ఝాన్సీ లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు


వసమామిడిలోని రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సోందొర

జి.మాడుగుల: మండలంలోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలైన వసమామిడి, బొడ్డుమామిడి, నిట్టమామిడి, నెయ్యలబంద, తల్లిమామిడి, సీతబంద, జోడిమామిడి, బొందులపనుకు, జర్రాయి, చాడంగి గ్రామాల్లో గెమ్మెలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సోందర ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినా తక్షణమే దగ్గరలోని పీహెచ్‌సీలను సంప్రదించి నయం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 151మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో 33 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, 51 మందికి రక్తహీనత, సుగర్, బీపీ, సికిల్‌సెల్, అనీమియా పరీక్షలు చేశారు. 67 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులను డెలివరీ సమయానికి వారం రోజుల ముందుగా ఆరోగ్య కేంద్రంలో చేర్పించాలని సూచించారు. గ్రామాల్లో అనారోగ్యంతో ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు. కాచి చల్లార్చి వడపోసిన నీటినే వినియోగించాలని, అందరు విధిగా దోమతెరలు వాడి దోమకాటు నుంచి రక్షణ పొందాలన్నారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలను వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వై.పెర్నినాయుడు, హెల్త్ అసిస్టెంట్ రాజు, డీఈవో రామచంద్ర, ఏఎన్ఎం నాగమణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గిరిజనుడికి గాయాలు


గాయపడిన తెల్లన్నదొర

గూడెంకొత్తవీధి: విద్యుదాఘాతంతో గిరిజన యువకుడు గాయపడిన సంఘటన శనివారం గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీలో చోటు చేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాల ప్రకారం గాలిమాను వీధి గ్రామానికి చెందిన గబులంగి తెల్లన్నదొర ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు కలుపుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో అతని చేతులకు పొట్టభాగంలో గాయాలయ్యాయి. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి


సర్టిఫికెట్లు అందజేస్తున్న కెవీకె కో–ఆర్డినేటర్ లలితాకామేశ్వరి

రంపచోడవరం: దేశవాళి చేపలతో పాటు విభిన్న రకాలైన చేపల పెంపకంతో గిరిజన రైతుల ఆర్థికంగా బలోపేతం కావచ్చని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వీరాంజనేయులు అన్నారు. పందిరిమామిడి కెవీకెలో నేషనల్ సెంటర్ ఫర్ సస్టేయస్‌బుల్ ఆక్వా కల్చర్ (ఎన్‌పీసీఎస్‌ఏ) కాకినాడ, కెవీకె సంయుక్తంగా చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులు, పెంపకంపై మూడు రోజులు శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కెవీకె కో–ఆర్డినేటర్ డాక్టర్ లలితా కామేశ్వరి మాట్లాడుతూ గిరిజన మత్స్య రైతులు శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేపలు పెంపకం ద్వారా ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు. నాక్సా రీజనల్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సబ్సిడీ అవకాశాలను వివరించారు. హేచరీల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

ఈకేవైసీ తప్పనిసరి


పెదబయలు ఏవో కార్యాలయంలో రైతులకు ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకులు

పెదబయలు: మండలంలో 16 గ్రామ సచివాలయాల పరిధిలో అటవీ హక్కుల పథకంలో పోడు భూములకు పట్టాలు కలిగిన రైతులకు ఈకేవైసీ నమోదు కార్యక్రమం మండలంలో శరవేగంగా జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అడ్డూరి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో 6570 మంది గిరిజన రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ చేశామన్నారు. వ్యవసాయ శాఖ కమీషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఈనెల 22 వరకు డ్రైవ్ చేపట్టి రైతులకు ఈకేవైసీ నమోదు చేయాలని సూచించారు. మండలంలో ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు కలిగి ఉన్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. మండలంలోని 1500 మందికి ఈకేవైసీ నమోదు చేశామన్నారు.

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు తక్షణమే ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని గూడెంకొత్తవీధి మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు కోరారు. ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఆర్వోఎఫ్ఆర్ భూములు కలిగిన రైతులు వారి వివరాలను ఆర్‌బీకేల్లో ఉన్న ఇన్‌చార్జిల వద్దకు వెళ్లి వలంటీర్ల ద్వారా వారి వివరాలను ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

డుంబ్రిగుడ: ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు. 1987 నుంచి సభ్యత్వం కలిగి ఉన్న సభ్యులు వారి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫోటో, భూమి పట్టా, వన్‌బి అండంగల్‌తో పాటు ఫోన్ నంబర్ కూడా అందజేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9490670853 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

ఎటపాక: రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాబిన్‌సుదర్శన్ కోరారు.మండలంలో మొత్తం 3962 మంది రైతులకుగాను ఇప్పటి వరకు 3125మంది ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. ఇంకా 837 మంది చేయించుకోవాలన్నారు. మీదగ్గరలోని గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

తూనికల్లో మోసాలకు పాల్పడితే చర్యలు


సంతలో బల్ల కాటాలను పరిశీలిస్తున్న అధికారులు

హుకుంపేట: వారపు సంతల్లో వ్యాపార దుకాణాల్లో తూనికల్లో మోసాలు జరిగితే సహించేది లేదని తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ పి.డి.వి.అప్పలరాజు చెప్పారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించే వారపు సంతలో తూనికలు, కొలతల శాఖ సిబ్బందితో కలిసి సంతలో బల్ల కాటలు, ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు, చేతి కాటాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వారపు సంతల్లో తూకాల్లో మోసాలను అరికట్టిందుకు కృషి చేస్తామన్నారు. హుకుంపేట వారపు సంతలో తూనికల్లో తేడాలున్నట్టు గుర్తించిన నలుగురిపై కేసులు చేశామన్నారు. చిరు వ్యాపారాలు, దుకాణదారులు వాడుతున్న తూనిక యంత్రాలను సరిచేసుకుని శాఖాపరమైన సీలు వేసుకోవాలని ఆదేశించారు. తూనిక యంత్రాలకు సీలు లేకుండా ఉంటే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది రమణమూర్తి, చిన్నమ్మ తదితరులున్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్


అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

గూడెంకొత్తవీధి: మండల పీఏసీఎస్ అధ్యక్షుడిగా వంతల అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రం శనివారం జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించిన అరుణ్‌కుమార్‌ను ఎంపీపీ బోయినకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు శివరత్నం, సర్పంచ్‌లు ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌లు రాజు, దుర్గా, సుభద్ర, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, కాసులమ్మ, నాయకులు గిరి, బుజ్జిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

డుంబ్రిగుడ: జగనన్న ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నామని లైగండ ఎంపీటీసీ సభ్యులు బురిడి రామారావు అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. లైగండ, అరమ, తుంబ్రుంగుడ, బడిమెల, ముసిరి గ్రామాల్లో ప్రభుత్వం అందించిన పథకాలపై ప్రచారం చేశారు. నాయకులు పరుశురాం, తుమ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు లాంగ్‌టెర్మ్ ఇంటర్న్‌షిప్


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్

అరకులోయటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు లాంగ్‌టెర్మ్ ఇంటర్న్‌షిప్ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ కోరారు. కళాశాలలో శనివారం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ వల్ల ప్రయోజనాలను వివరించారు. ఈ నెల 16 నుంచి మే15వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో విధిగా పాల్గొవాలన్నారు. విద్యా ప్రగతిపై అంచనా వేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు అతి సులువుగా ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవడానికి ప్రయోజనకరంగా ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అధ్యాపకులు మెంటర్లుగా వ్యవహరిస్తారన్నారు. వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ పుష్పరాజ్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు


వారపు సంతలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ నాయుడు, పోలీసు సిబ్బంది

హుకుంపేట: మండల కేంద్రంలోని శనివారం జరిగిన వారపు సంతలో సీఐ ఎస్.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందన్నారు. గంజాయి రవాణా చేసినా, సహకరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సారా తయారీ, గంజాయి సాగు వంటి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వారపు సంతలో వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. పలువురు పోలీసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.40 లక్షల నిధుల మంజూరు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పంచాయతీకు రూ.40లక్షల విలువైన అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్న గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ఈ నిధులు మంజూరైనట్టు సర్పంచ్ గొల్లపూడి రమణి తెలిపారు. స్థానిక సచివాలయం–2లో శనివారం జరిగిన గ్రామసభలో ప్రజలు సూచించిన మేరకు పనులకు ఆమోదం లభించినట్టు చెప్పారు. ఈ మేరకు పనుల్లో భాగంగా సీసీ రోడ్లు, కల్వర్టు, డ్రైనేజీ తదితర 14 పనులు ఉన్నట్టు తెలిపారు. ఈ పనులు నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు పర్యవేక్షించాలన్నారు. పంచాయతీకు చెందిన రాజవొమ్మంగి, రవీంద్రనగర్, శ్రీరామనగర్, ముర్లవానిపాలెం, బూరుగపల్లి, సూరంపాలెం జనావాసాల్లో ఈ పనులు త్వరలో ప్రారంభించనున్నట్టు చెప్పారు.

180 మందికి కంటి వైద్య పరీక్షలు


శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతపల్లిరూరల్: ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమం సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.వి. గిరి అన్నారు. మండల కేంద్రంలో శనివారం అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమం సంఘం సమక్షంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. శిబిరం ద్వారా గిరిజన ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కుటుంబసభ్యులకు సుమారు 180 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. పరీక్షల్లో 13 మందికి శస్త్రచికిత్సలు చేయుంచుకోవాలని వైద్యులు సూచించారు. ఎంఈవో వనపల ప్రసాద్, సంఘం సభ్యులు గంగరాజు, మధు, మోహన్, గోపీనాథ్, వరలక్ష్మి , శంకర్ ఫౌండేషన్ మెనేజర్ చంద్రశేఖర్, వైద్యులు శశి, శక్తి తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు వేగవంతం


సెల్ టవర్‌ను పరిశీలిస్తున్న వైస్ సర్పంచ్ రామన్న

అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీలో సెల్ సిగ్నల్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి సెల్ టవర్ పనులు వేగవంతం చేయాలని వైస్ సర్పంచ్ రామన్న కోరారు. ఆయన శనివారం సెల్ టవర్ పనులను పరిశీలించారు. సిగ్నల్ లేకపోవడంతో గ్రామ సచివాయ సిబ్బంది ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల వివరాల అప్‌లోడ్, ఈకేవైసీ తదితర పనులకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.